సామాజిక సేవ.. విద్యాభివృద్ధికి తోవ

- స్ఫూర్తి నింపుతున్న పద్మశాలీయ అభ్యుదయ సంఘం
- కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు
- నేడు విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : పద్మశాలీయ అభ్యుదయ సంఘం 26 ఏళ్లుగా పట్టణంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతోంది. పద్మశాలీయులతో పాటు ఇతర కులస్తులకు ప్రతిభాపురస్కారాలు అందించడం, ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, చలివేంద్రాల ఏర్పాటు, దుప్పట్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టి అందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కేవలం పద్మశాలీయ దాతల నుంచి విరాళాలు సేకరించి ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 1999వ సంవత్సరంలో 18 మంది 7వ, 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన పద్మశాలీయ, పద్మశాలీయేతర విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులుగా రూ.20వేలు పంపిణీ చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఎంసెట్, మెడిసిన్‌లో ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచిన ప్రముఖుల చేతుల మీదుగా ఈ ప్రతిభా పురస్కారాలను, నగదు ప్రోత్సాహక బహుమతులు అందించి వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇక్కడ ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులు చాలామంది డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారు. ఈ ఏడాది 84 మంది విద్యార్థులకు పతిభా పురస్కారాలుగా రూ.2.72లక్షలు, 20 మంది వీవర్స్‌లకు రూ.40వేలు అందజేశారు. ప్రతి ఏడాది వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ, చేనేత వృత్తిని ప్రోత్సహించేందుకు 55 ఏళ్లు దాటిన పద్మశాలీయ చేనేతలకు నగదు పురస్కారాలు అందించి సత్కరిస్తున్నారు. నియోజక వర్గంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జిల్లాపరిషత్, సరస్వతీ విద్యామందిరాల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు నోటు పుస్తకాలు అందించేవారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తుండటంతో 10వ తరగతి విద్యార్థులకు మూడు నోటుపుస్తకాలు, పరీక్ష అట్ట, జామెంట్రీబాక్స్, జూనియర్ కళాశాల విద్యార్థులకు 6 నోటు పుస్తకాలు, పరీక్ష అందిస్తున్నారు. ఈ ఏడాది నియోజక వర్గంలోని 30 పాఠశాలల విద్యార్థులు 1,718 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 155 మంది విద్యార్థులకు మొత్తం 1,873 మందికి నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని అందించనున్నారు. ఇందుకోసం దాదాపు రూ.5 లక్షలు విలువచేసే 7 వేలు పైగా పుస్తకాలు, 1,873 పరీక్ష అట్టలు, 1,718 జామెంట్రీ బాక్సులు సిద్ధం చేశారు.

నేడు విద్యార్థులకు పంపిణీ

స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్ప, ఎంఈఓలు పాల్గొనున్నారు. కార్యక్రమంలో పాల్గొనాలని అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సాధు అశోక్, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు కోరారు.



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న పద్మశాలీయ అభ్యుదయ సంఘం నాయకులు (ఫైల్)



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పుస్తకాలు

విద్యను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో..



ప్రతిభగల, పేద విద్యార్థులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో పద్మశాలీయ దాతల సహకారంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రతిభా పురస్కారాలు, ఉచిత నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్నాం. ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిరపడటంతో పాటు దేశ విదేశాల్లో పలు ఉద్యోగాలు చేస్తున్నారు.

- వద్ది నరసింహులు, పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

నేడు శివాలయం గదుల వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి (శివాలయం) ఆలయానికి సంబంధించిన 15 షాప్ గదులను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గదులను మూడేళ్ల కాలపరిమితికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని వారు పేర్కొన్నారు. గదులను దక్కించుకున్న వారు మూడు నెలల బాడుగను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

చినుకుపడితే చీకటే



విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దృశ్యం

బి.కోడూరు : మండలంలో విద్యుత్ లైన్లు సరిగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షం, గాలికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి గ్రామాలు అంధకారంలో గడపాల్సి వస్తుంది. గత రెండు రోజులుగా కొద్దిపాటి వర్షం పడితే విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే పాయలకుంట్ల ఫీడర్ పరిధిలోని మాధవరాయునిపల్లె, మేకవారిపల్లె, పందివీడు, మూలవారిపల్లె, పెద్దుళ్లపల్లె, కొండంపల్లె తదితర గ్రామాల్లోని ప్రజలు అంధకారంలో గడిపారు. సంబంధిత అధికారులు చొరవచూపి జరుగుతున్న నూతన విద్యుత్ లైన్ల పనులు త్వరితగతిన పూర్తిచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాటం వీరయ్య సేవలు మరువలేం



ప్రధానోపాధ్యాయుడు కాటం వీరయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దువ్వూరు : దువ్వూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాటం వీరయ్య పదవీవిరమణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ డీఈఓలు కృష్ణప్ప, రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఒక్క ఉద్యోగికి తప్పనిసరి అని తెలిపారు. కాటం వీరయ్య పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల వికాసానికి ఎంతో కృషి చేశారని, ఆయన అందించిన సేవలను మరువలేమని కొనియాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కాటం వీరయ్య, లక్ష్మీదేవి దంపతులను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవిశంకర్, భాస్కర్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత



చింతలపల్లెలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

కలసపాడు : మండలంలోని చింతలపల్లె గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక గిద్దలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంతో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన త్రైత సిద్ధాంతంభగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు ఎ.రమేష్, సభ్యులు శివ, సుభాషిణి, నారాయణ, పుల్లమ్మ, ఖాదర్, వెంకటేష్, లక్ష్మిదేవి, పార్వతి పాల్గొన్నారు.

ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివి



ప్రతాపరెడ్డి దంపతులను సన్మానిస్తున్న రఘురామిరెడ్డి తదితరులు

రాజుపాళెం : రాజుపాళెం పీహెచ్‌సీలో కంటి వైద్యాధికారిగా పనిచేస్తున్న వై. వీర ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివని ప్రొద్దుటూరు తాలుకా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు కెజె.రఘురామిరెడ్డి కొనియాడారు. రాజుపాళెంలోని పీహెచ్‌సీ ఆవరణంలో సోమవారం ప్రతాప రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతాపరెడ్డి దంపతులకు రఘురామిరెడ్డి, డీపీఎం సునీత, వైద్యులు మంజుల, నిఖిల, కల్లూరు వైద్యుడు శివప్రసాద రెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సునీత, మైదుకూరు తాలుకా ప్రెసిడెంట్ చంద్రమౌళి, ప్రొద్దుటూరు తాలుకా వైస్ ప్రెసిడెంట్స్ శివరామానుజ, మధుసుదన్‌ఘనంగా సన్మానించారు.

ప్రిన్సిపాల్‌గా ప్రకాష్‌రావు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సోమవారం సగిలి ప్రకాష్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆయన సోమవారం ఎఫ్ఏసీగా బాధ్యతలు తీసుకోవడంపై సహచర అధ్యాపకులు, పట్టణ ఉపాధ్యాయులు, పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయిన ప్రజలు

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మిన ప్రజలు మోసపోయారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తాము ఓడిపోయామని, ప్రతిపక్షంగా తమకు ఇంకో ఏడాది వరకు పని ఉండదని భావించామని, అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం అంత సమయం ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చిన నెల లోపే ప్రజాసమస్యలు ప్రస్తావించాల్సి వస్తోందని గోవిందరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు వృద్ధాప్య, వితంతు పింఛన్లు జూలై 1 న రూ. 7 వేలు చెల్లిస్తామన్నారని, అలాగే సోమవారం చెల్లించారన్నారు. అయితే దివ్యాంగుల పింఛన్ రూ. 3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచడంతో పాటు మూడు నెలలు కలిపి రూ. 15 వేలు చెల్లించాల్సి ఉందని, మంచానికి పరిమితమయినవారికి, డయాలసిస్ రోగులకు రూ. 10 వేలను 15 వేలకు పెంచుతామన్నారని, వారికి మూడు నెలల వ్యత్యాసంతో రూ. 30 వేలు చెల్లించాల్సివుండగా వారికి అలా ఇవ్వలేదన్నారు. కేవలం వృద్ధాప్య, వితంతు పింఛన్లు మాత్రమే పెంచి ఇచ్చారన్నారు. వలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు సోమవారం సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయించారని, వలంటీర్లను పక్కన పెట్టడం గమనిస్తే ఇక ఆ వ్యవస్థకు మంగళం పాడినట్లేననే అనుమానం వస్తోందన్నారు.

హనుమ వాహనంపై శ్రీనివాసుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు శ్రీవారి కల్యాణం

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9-30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, సాయంత్రం గరుడ వాహనసేవ ఉంటుందని తెలిపారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దారు

అట్లూరు: రేషన్‌కార్డు దారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు వేణుగోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలకూరు రేషన్‌షాపును ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్డుదారులకు సరుకులు పంపిణీ పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడుతూ తూకాలలో సక్రమంగా ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని దుకాణాదారులను ఆదేశించారు.

నిబంధనలకు విరుద్ధంగా రేషన్ పంపిణీ

ప్రొద్దుటూరు : నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రాంతాల్లో సోమవారం చౌకదుకాణాల్లోనే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నెలా మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన విషయం తెలిసిందే. అధికారులు మాత్రం యథావిధిగా వాహనాల ద్వారా మాత్రమే సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. అయితే అధికార పార్టీకి చెందిన కొంత మంది డీలర్లు కొత్తగా రేషన్ షాపులు దక్కించుకుని రేషన్ షాపుల వద్దే సరుకులు పంపిణీ చేశారు. అధికారుల ఆదేశాలను రేషన్ డీలర్లు పట్టించుకోకపోవడం గమనార్హం.

మాంసం విక్రయాలు నిలిపేయండి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని సంజీవనగర్, స్వరాజ్యనగర్ ప్రాంతాల్లో మాంసం విక్రయాలను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సోమవారం మాంసం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహాల మధ్య మాంసం దుకాణాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రస్తుతం డయేరియా వ్యాధి ప్రబలకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వీటిని నిలిపివేయాలని కోరారు. మాంసం విక్రయాల కోసం సదుపాయాలు ఏర్పాటు చేసి మరో ప్రదేశానికి తరలిస్తామని తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలో బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు నీటి సఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ పథకం కింద పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా ఇంజినీరింగ్ వర్క్స్ వారు నూతనంగా వేసిన పంపింగ్ లైన్‌ను పాతమార్కెట్ రిజర్వాయర్‌కు అనుసంధాన పనులను మంగళవారం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాతమార్కెట్ రిజర్వాయర్‌కు సంబంధించిన వెదుర్ల బజార్, వెంగళరెడ్డిపేట, తిరుమలనాయుని పేట, రాజబాటవీధి, కోట వీధి, ఆదర్శనగర్, అమ్మవారిశాల మెయిన్ బజార్, జోక్‌పాలెం, లైట్‌పాలెం, దస్తగిరిపేట, ఎస్‌పీయూ కాంపౌండ్, జిన్నా రోడ్డు, గౌరమ్మ కట్ట వీధి, నడింపల్లె, ఖాదర్‌హుస్సేన్ మీదు వీధి, రాజాజీ రోడ్డు, మహమ్మదీయ కాలనీ, ఎల్ఐసీ ఆఫీసు రోడ్డు, హైదర్ ఖాన్ వీధి, సుందరాచార్యుల వీధి, దర్గా బజార్, త్యాగరాజు వీధి, గంగమ్మ టెంపుల్ వీధి, ఇస్లాంపురం, కోనేటి కాలువ వీధి, రంగయ్యగారి సత్రం వీధి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

పవిత్రమైనది వైద్య వృత్తి



ప్రొద్దుటూరు క్రైం : కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వరప్రసాద్ తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు హనీఫ్ బాబా, శ్రీనివాస్‌లను సిబ్బంది సోమవారం సన్మానించారు. పూలు, బొకేలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ మనిషికి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే అదంతా వృధాయే అని తెలిపారు. అనారోగ్యంతో బాధ పడేవారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యులకే ఉందన్నారు. అందుకే ప్రజలు వైద్యుడిని సాక్షాత్తూ దేవుడిగా భావిస్తారని తెలిపారు. అనంతరం సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్‌ను వైద్యులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చంద్రకళ, ఫార్మాసిస్టు శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, హెల్త్ అసిస్టెంట్‌లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ల సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు ఘన సన్మానం

చాపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ వైద్యులు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డా. రాజేష్‌కుమార్, డా. శ్రీవాణిలను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానమని, అమ్మ కడుపులో ఉన్నప్పుడు ప్రాణం పోసేవాడు దేవుడు అయితే ఆ ప్రాణం పోకుండా పునర్జన్మను ప్రసాదించేవాడే డాక్టర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, ఫార్మసీ అధికారి సుభాషిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలకు నిబంధనలు వర్తించవా?

ప్రొద్దుటూరు : అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన షాపింగ్ రూముల వేలం పాటలో ఎస్సీలకు నిబంధనలు వర్తించవా అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గడ్డం నరసింహులు మాదిగ ప్రశ్నించారు. ఆయన సోమవారం తమ కార్యాలయంలో మాట్లాడుతూ 14 షాపింగ్ గదుల వేలం నిర్వహిస్తుండగా నిబంధనల ప్రకారం 15 శాతం రిజర్వేషన్ తమకు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దశాబ్దాల నుంచి కొందరు మాత్రమే వేలంలో పాల్గొంటున్నారని తెలిపారు. అగస్త్యేశ్వరుడు ఒక కులానికి మాత్రమే కాదని, హిందువులలో ప్రతి కులానికి సంబంధించిన వారు ఉన్నారన్నారు. ఈ విషయంపై మంగళవారం అంగస్త్యేశ్వరస్వామి ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించామన్నారు.

సుందర కాండ విశ్లేషణ పుస్తకావిష్కరణ



రచయిత శంకరయ్య నాయుడు దంపతులను సన్మానిస్తున్న నరాల రామారెడ్డి, జడ్డి ఇస్మాయిల్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లెలోని ఎస్‌బీ మెమోరియల్ హైస్కూల్‌లో సోమవారం కమ్యూనిస్టు నాయకుడు దస్తగిరి సాహెబ్ శతజయంతి ఉత్సవం, డాక్టర్ పోలవరపు శంకరయ్య నాయుడు రచించిన సుందరకాండ విశ్లేషణ పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణంలో ప్రధాన కాండమైన సుందరకాండ విశ్లేషణ పుస్తకంలో రచయిత శంకరయ్య నాయుడు చక్కగా విశ్లేషించారన్నారు. విశ్రాంత తెలుగు పండితుడు ఏసీ దస్తగిరి మాట్లాడుతూ బండ్ల రమణయ్య సన్నిహితం వలన సుందరకాండపై శంకరయ్యకు అభిరుచి కలిగిందన్నారు. హనుమంతుడిని సుందరుడు అని పిలుస్తారని, అందువల్లనే రామాయణంలో ప్రధానమైన ఆ కాండకి సుందరకాండ అని పేరు పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి మాట్లాడుతూ మానవుడైనా, దేవుడైనా మానవీయత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం రచయిత పోలవరపు శంకరయ్య నాయుడు దంపతులను సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధను బద్వేలు మున్సిపాలిటీ, పోరుమామిళ్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న దాడులు, కక్ష సాధింపు చర్యలను కలిసికట్టుగా సమర్థవంతంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, నరసింహులు, మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ ముంతాజ్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పింఛన్లు అందాలి



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్, మాజీ మంత్రి డీఎల్

చాపాడు: పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందాలని ఎమ్మెల్యే పట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పెంపు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రహంతుల్లయ్య, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ పీరయ్య, టీడీపీ నాకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి కుమ్మర కొట్టాలు గ్రామంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో సోమవారం పింఛన్లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హతలేని పింఛన్లు తొలగిస్తాం

బ్రహ్మంగారిమఠం: అర్హతలేని పింఛన్లను తొలగించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఎంపీడీఓను ఆదేశించారు. సోమవారం బి.మఠంలో పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తహసీల్దార్ శ్రీనివానివాసులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డితో పాటు టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, ముక్తియార్ పాల్గొన్నారు.

ప్రోటోకాల్ వర్తించదా?

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి అర్హత లేని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం విచిత్రంగా ఉందని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు అజీం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన ఎన్నికల్లో ఓడిపోయిన నాయకులు, టీడీపీ కార్యకర్తలు పింఛన్ల పంపిణీలో పాల్గొనవచ్చా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లకు కనీస సమాచారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.

95 శాతం పింఛన్లు పంపిణీ

కాశినాయన : మండలంలో సోమవారం 95 శాతం మంది పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారికి మంగళవారం సాయంత్రం లోపు పంపిణీ చేస్తామన్నారు.

దువ్వూరు : అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందిస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం దువ్వూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన పింఛన్లను పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ

గోపవరం : మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. రాచాయపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ పాల్గొని అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 2,684 పింఛన్లు ఉండగా మొదటి రోజు 97 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. మిగిలిన 3 శాతం రెండవ రోజు పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

వృద్ధులకు అన్నదానం

కాశినాయన : మండలంలోని బాలమ్మసత్రం అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీ నాయక్ కుమారుడు డాక్టర్ దినేష్‌లక్ష్మీకుమార్ 22వ పుట్టినరోజును పురస్కరించుకుని వృద్ధులకు అన్నదానం చేశారు.

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గంజికుంట శరత్‌కుమార్, చైత్రావతి దంపతులు తమ కుమార్తె షణ్ముఖప్రితి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు.

ల్యాండ్ కన్వర్షన్‌ను వసూలు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి ల్యాండ్ కన్వర్షన్‌ను వసూలు చేయాలని గోపవరం పంచాయతీకి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ గోపవరం పంచాయతీ సచివాలయం 5 పరిధిలో శ్రీవిజయ వినాయకనగర్ పేరుతో అక్రమ లేఅవుట్ వేశారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే రెండు సార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను ఫిర్యాదు చేసినప్పుడు నోటీసులు ఇస్తారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి ల్యాండ్ కన్వర్షన్‌ను వసూలు చేయాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



బద్వేలు అర్బన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బద్వేలు అర్బన్ : వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో డయేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు డయేరియా, కీటకజనిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలలోని మరుగుదొడ్లను ప్రతిరోజు శుభ్రం చేయాలని కోరారు. పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు తయారు చేయాలని కోరారు. ప్రతి గురువారం మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత విద్యార్థులతో ఐరన్ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, సీహెచ్ఓ శిరీష, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి తెలిపారు. అతిసార నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం భవాని నగర్, రెడ్డినగర్‌లలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల శుభ్రత వల్ల దోమలు వృద్ధి చెందవని చెప్పారు. తద్వారా ఎలాంటి వ్యాధులు రావని తెలిపారు. వైద్యాధికారి బద్వేలి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే నీళ్ల విరేచనాలతో పాటు మనిషి నీరసించిపోతాడని తెలిపారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరెడ్డి, సీఓ ఎంవీసుబ్బారెడ్డి, ఏఎన్ఎం మల్లీశ్వరమ్మ, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.